కలెక్టర్ దృష్టికి కరకంబాడి పేదల ఇళ్లస్థలాల సమస్య

టిడిపి, జనసేన పొత్తులో భాగంగా...

తిరుపతి నుంచి నాగబాబు

టిడిపి ఆశావాహులకు నిరాశేనా..



కె.నాగబాబు

వరప్రసాద్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన పొత్తులో భాగంగా జనసేన అభ్యర్థిగా కొణిదెల నాగబాబు పోటీ చేయనున్నారు. అయితే టిడిపి నుంచి మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ మనవరాలు కీర్తి, కోడూరు బాలసుబ్రమణ్యం, వూకా విజయ్‌కుమార్, జెబి శ్రీనివాస్, నరసింహయాదవ్, కుప్పాల గిరిధర్‌కుమార్ పోటీ పడినప్పటికీ వారికి నిరాశే ఎదురయ్యింది. జనసేన టిడిపి పొత్తులో భాగంగా తిరుపతి, చిత్తూరు అసెంబ్లీ స్థానాలను జనసేనకు కేటాయిస్తారని ప్రచారం జరిగింది. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తిరుపతి నుంచి పోటీ చేస్తారని తొలుత చర్చ నడిచింది. ఇక్కడ బలిజ సామాజికవర్గం ఓట్లు గణనీయంగా ఉండడంతో గెలుపు సునాయాసం అవుతుందని భావించారు. అయితే పవన్‌కల్యాణ్ ఏలూరు జిల్లా భీమవరం నుంచే పోటీ చేస్తారని, ఖరారైనట్లేనని చర్చ నడుస్తోంది. దీంతో తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గానికి పవన్‌కల్యాణ్ అన్న కొణిదెల నాగబాబుకు కేటాయించారు. ప్రజారాజ్యం పార్టీ స్థాపించినపుడు నాగబాబు అన్న కొణిదెల చిరంజీవి పాలకొల్లు, తిరుపతి నుంచి పోటీ చేయగా పాలకొల్లులో ఓటమిని చవిచూశారు. తిరుపతి ప్రజలు ఆదరించి అసెంబ్లీకి పంపించారు. 2024 ఎన్నికల్లో చిరంజీవి తమ్ముడు కొణిదెల నాగబాబు జనసేన నుంచి బరిలో దిగుతారని సమాచారం. టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు సైతం సొంత పార్టీలో పలువురు పోటీలో ఉన్నప్పటికీ వైసిపిని గట్టిగా ఎదుర్కోవాలంటే జనసేన నుంచే పోటీ చేస్తే బాగుంటుందని చంద్రబాబు పవన్‌కల్యాణ్‌కు సూచించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే నాగబాబు పేరు ఖరారైనట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా తిరుపతి పార్లమెంట్ స్థానానికి మాజీ మంత్రి పనబాక లక్ష్మి భర్త పనబాక కృష్ణయ్య, మాజీ ఎంపి నెలవల సుబ్రమణ్యం, మాజీ మంత్రి పరసా రత్నంలు పోటీ పడుతున్నారు. అయితే ఇటీవల గూడూరు వైసిపి సిట్టింగ్ ఎంఎల్ఎ వరప్రసాద్ తనకు సీటు కేటాయించకుండా అన్యాయం చేశారని, జగన్‌పై గుర్రుమన్నారు. అంతేకాకుండా మంగళగిరిలో జనసేన పార్టీ కార్యాలయంలో అధినేత పవన్‌కల్యాణ్‌ను కలిసారు. తాను తిరుపతి ఎంపిగా బరిలో దిగుతానని, అయితే ఏ పార్టీ అన్నది త్వరలోనే వెల్లడిస్తానని ప్రకటించారు. పొత్తులో భాగంగా తిరుపతి పార్లమెంట్‌కు వరప్రసాద్ పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి.

సర్వేల్లోనూ నేనే ఎమ్మెల్యేగా : సుగుణమ్మ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నగదు, మద్యాన్ని పంచకుండా ఎన్నికల్లో పాల్గొనడానికి మేము సిద్ధంగా ఉన్నామని, అధికార వైసిపి పార్టీ సిద్ధమా అని తిరుపతి మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ సవాల్ విసిరారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గడిచిన సంవత్సరాలుగా రాష్ట్రంలో వైసిపి పాలనతో ధర్మం గాడి తప్పిందని, ధర్మాన్ని పరిరక్షించడానికి జనసేన, టీడీపీ పార్టీలు సంయుక్తంగా కలిసి ఎన్నికల్లో పోటీకి దిగనున్నాయన్నారు. తిరుపతిలో తండ్రి కొడుకుల ఇష్టారాజ్యం కొనసాగుతోందన్నారు. టిటిడి చైర్మన్ గా దోచుకుంటున్నారని ఆరోపించారు. తమ కుటుంబం 1982 నుండి ప్రజా సేవ కోసం పనిచేస్తుందని, వివిధ హోదాల్లో ప్రజలకు సేవ చేసామన్నారు. ప్రజా సర్వేల్లో తాను ఎమ్మెల్యేగా 2024లో గెలుపు సాధిస్తానని ఫలితాలు వచ్చాయని, ప్రజలకు తమ కుటుంబంపై ఉన్న నమ్మకానికి కతజ్ఞతలు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు ఆర్సి మునికష్ణ, పుష్పవతి, బుల్లెట్ రమణ, మునిశేఖర్ రాయల్, వూట్ల సురేందర్ నాయుడు, దంపురి భాస్కర్, మహేష్ పాల్గొన్నారు.

టిడిపి ఆశావాహుల్లో కుప్పాల గిరిధర్‌కుమార్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

టిడిపి ఆశావాహుల్లో కుప్పాల గిరిధర్‌కుమార్ ఉన్నారు. టిడిపి నిర్వహించిన ఐవిఆర్ఎస్ సర్వేలో తిరుపతి వైసిపి అభ్యర్థికి ధీటైన వారిని నిలబెట్టాలని తిరుపతివాసి కుప్పాల గిరిధర్‌కుమార్ పేరు పరిశీలనకు వచ్చింది. తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ సోదరుడు కుప్పాల గిరిధర్‌కుమార్. టిటిడి మాజీ చైర్మన్ చదలవాడ క్రిష్ణమూర్తికి పిఎగానూ పనిచేశారు. దక్షిణ మధ్య రైల్వేలో చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. రైల్వేలో ట్రేడ్ యూనియన్ కార్యకలాపాల్లోనూ చురుగ్గా ఉన్నారు. నేషనల్ ఫెడరేషన్ ఇండియన్ రైల్వేమెన్‌లోనూ అనేక పదవులు నిర్వహించారు. తిరుచానూరు కొత్త రైల్వేస్టేషన్‌ను తీసుకురావడంలోనూ తీవ్రమైన కృషి చేశారు.

కరకంబాడి పేదలకు న్యాయం చేయండి

కలెక్టర్‌కు సిపిఎం విజ్ఞప్తి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కరకంబాడి ప్రాంతంలో గుట్టలను సైతం వదలకుండా వారం రోజుల నుంచి ఇళ్ల స్థలాల కొరకు రేయింబవళ్ళు పోరాడుతున్న పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్యలు జిల్లా కలెక్టర్ లక్ష్మీ షాను కోరారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ లక్ష్మీ షాను కలెక్టర్ ఛాంబర్‌లో కలిసి కరకంబాడి ప్రాంతంలో ఇళ్ల స్థలాలకై పోరాడుతున్న పేదల గురించి ప్రస్తావించారు.కరకంబాడి, రేణిగుంట చుట్టుపక్కల ప్రాంతాలలో వేలాదిమంది ప్రజలకు జగనన్న ఇళ్ల పట్టాలను ఇచ్చి స్థలం చూపలేదని ఆరోపించారు. ఈ ప్రాంతంలో చిన్న, చిన్న పనులు చేసుకుంటున్న పేదలకు ఎక్కడో దూర ప్రాంతంలో స్థలాలను ఇచ్చారని, ఆ ప్రాంతంలో కనీస సౌకర్యాలు కూడా లేని కారణంగా పేదలు తమ ప్రాంతంలోని ప్రభుత్వ భూములు ఇవ్వాలని కోరుతున్నారని విన్నవించారు. కరకంబాడి ప్రాంతంలో పదివేల ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు ఉన్నాయని, ఇందులో గణనీయమైన భాగం భూ బకాసురులు ఆక్రమించి సొమ్ము చేసుకున్నారని, ఆఖరుకు స్కూల్ ఆట స్థలాలను సైతం విడవకుండా ఆక్రమించారని కలెక్టర్ కు వివరాలను అందించారు. కరకంబాడి వద్ద పేదలు ఆక్రమించుకున్న స్థలం సిద్దుల రవి అధీనంలో ఉందని, పేరుకు ప్రభుత్వ భూమైన దానిపై నియంత్రణ రవి దేనని ఆరోపించారు. గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో మట్టిని, మైనింగ్‌ను తరలిస్తూ కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని ఆరోపించారు. అర్హులైన పేదలకు 125 ఎకరాల భూమిని పంచాలని, సమస్య పరిష్కారానికి కలెక్టర్ జోక్యం చేసుకోవాలని విన్నవించారు. కలెక్టర్ లక్ష్మి షా మాట్లాడుతూ అర్హులైన వారికి న్యాయం చేస్తామని, దరఖాస్తు ఇచ్చిన 90 రోజుల్లో పరిష్కారం చేయడం చట్టంలో ఉన్న అంశమేనని తప్పక పేదలందరికీ ఇళ్ల స్థలాలు అందిస్తామని హామీ ఇచ్చారు. తమకు న్యాయం జరిగేంతవరకు లేదా స్పష్టమైన హామీ లభించే వరకు కరకంబాడి ప్రాంతంలోని పేదలు ఆక్రమించుకున్న స్థలాన్ని విడిచి పెట్టేది లేదని నేతలు ప్రకటించారు. కరకంబాడి ఇళ్ల స్థలాల సాధన కమిటీ 3297 అర్జీలను జిల్లా కలెక్టర్ కు నేరుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఇండ్ల సాధన పోరాట కమిటీ నాయకులు సత్యశ్రీ, రాజశేఖర్, దీప, ఎర్రస్వామి, కుమారి, పవిత్ర, సుధ, మస్తానీ, పార్వతి, నూరి, రాధిక, శ్రావణి, జయసుధ, అమీర్జాన్, మస్తాన్, లోకేష్, మునిరాజమ్మ, కిషోర్, అరుణ్, లిల్లీ, నాగేంద్ర,రేణిగుంట సిపిఎం మండల కార్యదర్శి హరినాథ్, శివానందం తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించండి

తిరుపతి టౌన్ : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తిరుపతి కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీషాకు యూనియన్ జిల్లా కార్యదర్శి కె.విజయమ్మ అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాక ముందు మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పదివేల రూపాయల వేతనం ఇస్తానని చెప్పారని, అయితే అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు దాటినా పట్టించుకోలేదన్నారు. వంటగ్యాస్‌ను ప్రభుత్వం సరఫరా చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అధ్యక్షురాలు కె.శాంతమ్మ మాట్లాడుతూ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఆర్.లక్ష్మి, రైతుసంఘం నాయకురాలు హేమ, మధ్యాహ్న భోజన కమిటీ నాయకులు పజీరియా, లక్ష్మి, వాణి తదితరులు పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సి కావాలని నిరసన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నాలుగు సంవత్సరాల నుంచి మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం నిరీక్షిస్తున్న నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం నిరాశకు గురిచేసి రోడ్డుపై పడేలా చేసిందని విద్యార్థి యువజన సంఘాలు మండిపడ్డాయి. అన్నమయ్య సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించి, ఆర్డీవో కార్యాలయం లోనికి చొచ్చుకుపోయారు. ఈ సందర్భంగా పోలీసులతో వాగ్వాదం జరిగింది. ఏఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డిఎస్‌సి అభ్యర్థులను మోసం చేసి దగా డిఎస్‌సి ప్రకటించారన్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలకు పోస్టులు లేకుండా చేశారన్నారు. ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ ఒక పక్క విద్యలో విప్లవం అంటూనే ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చలపతి మాట్లాడుతూ డిఎస్‌సి నోటిఫికేషన్ సవరణ చేసి మెగా డిఎస్‌సి 25వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్బర్, సురేష్, ఉదయ్,హరి, అశోక్, శివ, పవన్, నవీన్, కార్తీక్, హరినాథ్ పాల్గొన్నారు.

పారశాల స్వీపర్లకు 16 నెలలుగా అందని వేతనాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్

మున్సిపల్ పరిధిలో గత 30 ఏళ్లుగా పనిచేస్తున్న స్వీపర్లకు 16 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, వారికి పూట గడవడమే కష్టంగా ఉందని సిఐటియు నాయకులు కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్ స్పందిస్తూ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలో నివాసం ఉంటున్న వారికి విద్యుత్ సౌకర్యం, మురికి కాల్వలు లేవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టా శంకరయ్య, జోగి శివకుమార్, బివి రమణయ్య, ఎస్. సురేష్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం పాటించాలి : కమిషనర్

తిరుపతి టౌన్ : తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పాటించకపోతే తగిన చర్యలు తీసుకుంటామనికమిషనర్ అదితి సింగ్ హెచ్చరికలు జారీ చేసారు. సోమవారం ఉదయం ఐదు గంటల నుండి మస్టర్ పాయింట్ల వద్ద పారిశుధ్య కార్మికుల అటెండెన్స్ వివరాలను, కొన్ని ఏరియాల్లో పారిశుధ్యం, కొన్ని దుఖాణాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ పరిశీలించారు. లక్ష్మీపురం సర్కిల్లో ఓ బార్ వద్ద సింగిల్ యూజ్ ప్లాస్టిక్ గ్లాసులు విక్రయిస్తూ కనబడడంతో కమిషనర్ ఆదేశాల మేరకు ఐదు వేలు జరిమానా విధించారు. రేణిగుంట రోడ్డులో రెండు దుకాణాల ముందు చెత్త వేసి వుండడంతో రెండు వేలు చొప్పున జరిమానా విధించారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ సుమతి పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ బ్యూరో ఆధ్వర్యంలో అవయవ దానం ప్రాముఖ్యత అంశంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక మానవ శరీరం మరణానంతరము 18 మందికి జీవన దానం చేయగలదని వివరించారు. ఈ కార్యక్రమాన్ని విసి ఆచార్య భారతి, రిజిస్ట్రార్ ఆచార్య రజిని ప్రోత్సాహంతో విద్యావతి ఎన్ఎస్ఎస్ బ్యూరో కోఆర్డినేటర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తవిత తులసి, డాక్టర్ కే స్వాతి, కే సుజాత పాల్గొన్నారు.

యస్వీయూ ఇంజనీరింగ్ లేడీస్ హాస్టల్ నిర్మాణానికి రూ.10 లక్షలు

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినుల హాస్టల్ నిర్మాణం కోసం పర్వతరెడ్డి బలరామిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ , నెల్లూరు వారు 10 లక్షల రూపాయల చెక్ ను యస్వీయూ ఉపకులపతి ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డికి అందజేశారు. ఉదయం విసి బంగ్లాలో మేనేజింగ్ ట్రస్టీ జి. స్రవంతి, సురేశ్, వెంకటరమణా రెడ్డి, మదనమోహన్ రెడ్డి లు చెక్కు ను అందించారు .ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య దామోదర్ రెడ్డి , డా. భాను తదితరులు పాల్గొన్నారు.

గర్భాశయ క్యాన్సర్ నివారణకు వ్యాక్సిన్

ప్రజాశక్తి - క్యాంపస్

కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో 9 నుంచి 14 ఏళ్ల లోపు అమ్మాయిలలో గర్భాశయ క్యాన్సర్‌నివారణకు వ్యాక్సిన్ అందుబాటులోకి తెచ్చిందని డాక్టర్ కె.హైమావతి తెలిపారు. శ్రీ పద్మావతి మహిళావిశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్ర అసోసియేట్ ప్రొఫెసర్. డాక్టర్. కే. హైమావతి ప్రపంచ కాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం మహిళా ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్.కే. హైమావతి మాట్లాడుతూ మహిళలను వేధించే రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ అత్యంత ప్రమాదకరమని, వీటిని ప్రారంభ దశలోనే గుర్తించినట్లయితే మరణాలను తగ్గించవచ్చన్నారు. భారతదేశంలో 2022లో 14.61 లక్షల మంది ఈ మహమ్మారి మారిన పడ్డారు. అఖిలభారత వైద్య విజ్ఞాన సంస్థ నివేదిక ప్రకారం 2026 నాటికి ప్రతి సంవత్సరం 20 లక్షల మంది క్యాన్సర్ తో మరణించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఫర్జానా, మహిళా అధ్యయన కేంద్ర సిబ్బంది డాక్టర్ ఎం.ఇంద్రాణి, డాక్టర్ ఎం.సుచరిత పాల్గొన్నారు.

ఎన్‌బికె షాప్ ప్రారంభం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

తిరుపతిలో ఏర్పాటు చేసిన నెల్లూరు బాదం కీర (ఎన్ బికె) షాపును తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష ప్రారంభించారు. స్థానిక రామచంద్రపురం పుష్కరిణి సమీపంలో ఏర్పాటు చేసిన షాపు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ నెల్లూరులో అత్యంత ప్రసిద్ధి చెందిన నెల్లూరు బాదం కీరను తిరుపతి ప్రజలకు అందించే ఉద్దేశంతో యువకులైన పవన్ కళ్యాణ్, మురళీధర్ ఈ షాపును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం షాప్ నిర్వాహకులు మాట్లాడుతూ గత 60 సంవత్సరాలుగా నెల్లూరు జిల్లాలో బాదం కీర చాలా ప్రసిద్ధి చెందిందన్నారు. 20 సంవత్సరాల పైగా ఆ రుచిని ఆస్వాదిస్తున్న తాము తిరుపతి ప్రజలకు కూడా అందించాలని దేశంతో నగరంలో దీనిని ఏర్పాటు చేశామన్నారు. దీంతోపాటు ప్రసిద్ధి చెందిన కడప మజ్జిగనూ అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ రుచులను ఆస్వాదించి, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రేవతి పాల్గొన్నారు.

నెల్లూరు బాదం కీర షాపును ప్రారంభిస్తున్న డాక్టర్ శిరీష

ఐఐటి, ఐజర్‌లలో పెండింగ్ పనులు పూర్తవ్వాలి : కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

కేంద్ర విద్యాసంస్థలు ఐఐటి , ఐజర్ లలో పెండింగ్ పనులు మార్చి చివరి నాటికి పూర్తి చేస్తామని కలెక్టర్ డా.జి. లక్ష్మీషా సిఎస్ కు వివరించారు. సోమవారం మధ్యాహ్నం ఐఐటి, ఐజర్ కు సంబంధించిన పలు అంశాలపై విజయవాడ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కే.ఎస్ జవహర్ రెడ్డి సంబంధిత కార్యదర్శులతో, అధికారులతో కలిసి సంబంధిత జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. తిరుపతి కలెక్టరేట్ నుండి తిరుపతి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీషా, జెసి శుభం బన్సల్, ఐఐటి, ఐజర్ సంస్థల ప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. త్వరలోనే సమన్వయ సమావేశం నిర్వహించి బస్ షెల్టర్, వీధి దీపాలు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ తాగునీరు తదితర పెండింగ్ సమస్యలపై పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై రేపు రౌండ్‌టేబుల్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, కరువు, వలసల నివారణ, రాయలసీమ సమగ్రాభివద్ధికై చేపట్టవలసిన అంశాలను రాజకీయ పార్టీలు తమ తమ మ్యానిఫెస్టోలో చేర్చాలని కోరుతూ బుధవారం రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు రైతుసంఘాల సమాఖ్య సలహాదారు మాంగాటి గోపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం యూత్ హాస్టల్లో జరుగుతుందని, సామాజిక, రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

గూడూరు టిడిపి అభ్యర్థిగా పాశిం సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పాశిం సునీల్ కుమార్ పేరును అధిష్టానం ఖరారు చేసిందన్న సమాచారంతో పట్టణంలోని గడియారం స్థంభం, పార్టీ కార్యాలయం వద్ద అభిమానులు బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. పార్టీకి చెందిన నాయకులు పలువురు టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో సత్కరించారు. సునీల్ కుమార్ మాట్లాడుతూ... గత టిడిపి ప్రభుత్వంలో తప్ప వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత నియోజకవర్గంలో ఎలాంటి అభివద్ధి జరగలేదని తెలిపారు. ఈ సంబరాల్లో నాయకులు పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, రహీం, మస్తాన్ నాయుడు పాల్గొన్నారు.

టిడిపి శ్రేణుల్లో ఉత్సాహం

సనాతన హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయం : టిటిడి చైర్మన్

ధార్మిక సదస్సు తీర్మానాలను వివరిస్తున్న కరుణాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుమల

సనాతన హిందూ ధర్మ పరిరక్షణ కోసమే తిరుమలలో శ్రీ వేంకటేశ్వర ధార్మిక సదస్సును మూడు రోజుల పాటు నిర్వహించినట్లు టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఉద్ఘాటించారు. అరవై మంది పీఠాధిపతులు, మఠాధిపతుల సూచనలు, సలహాలతో సదస్సు తీసుకున్న 19 తీర్మానాలను మీడియాకు వెల్లడించారు. సదస్సు నిర్వహణలో టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి, జెఇఒలు సదా భార్గవి, వీరబ్రహ్మం కృషిని ప్రశంసించారు. 1933లో టిటిడి పాలకమండలి ఏర్పడిందని, దాస సాహిత్య ప్రాజెక్టు, మాతశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్ట్, అన్నమాచార్య ప్రాజెక్ట్, ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు, నాలాయిర దివ్యప్రభంధ ప్రాజెక్ట్, శ్రీనివాస కల్యాణోత్సవ శ్రీవేంకటేశ్వర వైభవోత్సవ ప్రాజెక్టుల ద్వారా ధార్మిక ప్రచార కార్యక్రమాలు విస్తతంగా జరుగుతున్నాయని చెప్పారు. హైందవ సనాతన ధర్మాన్ని , సంస్కతి, సాంప్రదాయాలను పరిరక్షించాలనే సదాశయంతో ఇలాంటి ప్రాజెక్టులను టీటీడీ అమల్లోకి తెచ్చిందని వివరించారు. ఎస్వీబీసీ ఛానల్ ప్రస్తుతం నాలుగు భాషలలో అద్వితీయంగా, దాదాపు 8 కోట్ల మంది వీక్షకులతో భక్తులందరినీ అలరింపజేస్తోందన్నారు. ఇతర మతస్తులు హిందూ మతాన్ని స్వీకరించడానికి ఆసక్తి చూపితే స్వాగతించాలని నిర్ణయించినట్లు చెప్పారు. తిరుపతిని సంపూర్ణ ఆధ్యాత్మిక వాతావరణం, భక్తి భావన కలిగేలా ఏర్పాటు చేయాలని తీర్మానించారు. గో సంరక్షణ అత్యావశ్యకతగా సదస్సు తీర్మానించిందన్నారు. పాఠ్య ప్రణాళికల్లో హిందూ ధర్మ ప్రాధాన్యతకు పెద్ద పీట వేయాలని, ఇందుకోసం ధర్మ ప్రబోధ కాలైన ప్రణాళికలు అవసరమని తీర్మానం చేసినట్టు చెప్పారు.



ప్రజాస్వామ్య పార్లమెంట్‌కు వీడ్కోలు : గల్లా జయదేవ్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తన కుటుంబానికి యాభై ఏళ్ల రాజకీయ చరిత్ర ఉందని, ప్రజల కోసం పోరాడే వారసత్వం ఉన్న కుటుంబం నుంచి వచ్చానని, తన తాత రాజగోపాల్‌నాయుడు స్వాతంత్ర్య పోరాటం చేసిన వ్యక్తని, తన గురువు ఎన్జీ రంగా స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ అన్నారు. పార్లమెంట్ ఉభయ సభలనుఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడుతూ ప్రజాస్వామ్య పార్లమెంట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు వెల్లడించారు. వివిధ కారణాల వల్ల తాను వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని, ప్రజాజీవితంలో ఉండి పారిశ్రామికవేత్తగా కొనసాగడం అంత సులభం కాదని, తాను రాజకీయ జీవితానికి విరామం ఇవ్వాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. రాజకీయాలకు దూరంగా ఉన్నా, దేశానికి సేవ చేయాలనే నిబద్ధతతో ఉన్నానన్నారు. ప్రధాని మోడీ నాయకత్వాన్ని, దేశం పట్ల విజన్‌ను అభినందిస్తున్నానని చెప్పారు. చంద్రయాన్ 3, అటల్ సేతు నిర్మాణం, ఆర్టికల్ 370 తొలగింపు, త్రిపుల్ తలాక్, మైనార్టీలకు పౌరసత్వం, పిఎం కిసాన్, పిఎం ఫసల్ బీమా యోజన ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని ఉటంకించారు. అమరావతి అభివృద్ధికి 1500 కోట్లు, గుంటూరు భూగర్భడ్రైనేజి వ్యవస్థకు వెయ్యి కోట్లు నిధులు సాధించానన్నారు. గుంటూరు లోక్‌సభ పరిధిలో 20వేల గృహాలు మంజూరయ్యాయని గుర్తు చేశారు. ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. తాను పూర్తి సమయాన్ని రాజకీయాలకు కేటాయించగలిగినప్పుడు తిరిగి రాజకీయాల్లోకి వస్తానని చెప్పారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని నీర్పాకోట ఎంపిపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఆధ్వర్యంలో రెండవ మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం సోమవారం మధ్యాహ్న భోజనాన్ని, రాగి జావ రుచి చూసి పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన కూరగాయలతో రుచికరమైన భోజనం వడ్డించాలన్నారు. గాజుల పెళ్లూరు వైసీ కాలనీలో పాఠశాల విద్యార్థులను విద్య, వసతి సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రతిరోజూ స్కూలుకు రావాలని సూచించారు. 5వ తరగతి విద్యార్థులకు తరగతి పరీక్షలపై అవగాహన కల్పించారు.

కోట తహశీల్దారుగా నాగరాజారావు

ప్రజాశక్తి - కోట: మండల తహశీల్దారుగా డి నాగరాజు రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ పద్మావతి ప్రకారం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో బాపట్ల జిల్లా వేమూరు మండలం నుండి వచ్చిన డి నాగరాజా రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పూలమాలతో వారికి సన్మానించారు.

బిఎన్ కండ్రిగ ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బిఎన్ కండ్రిగ ఎంపీడీవోగా సాలెట్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వారు బుచ్చినాయుడు కండ్రిగకు బదిలీ అయ్యారు. గతంలో చిట్టమూరు ఎంపీడీవోగా పనిచేశారు గతంలో బిఎన్ కండ్రిగ ఎంపీడీవో గా పనిచేస్తున్న సాయి లహరి నెల్లూరుకు బదిలీ అయ్యారు. ప్రస్తుత ఎంపీడీవో శాలెటుకు సూపరింటెండెంట్ త్రివిక్రమరావు స్వాగతం పలికి బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రాజశేఖర్, అరవింద మనోజ్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఏపిఎం ఇందిరా ఏపీవో భానుప్రియ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతిభ చూపిన వాలంటీర్లకు అభినందనలు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల కవాతులో ఆంధ్ర ప్రదేశ్‌లోని వివిధ విశ్వవిద్యాలయాల నుండి 10 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ ఏడాది ఆంధ్ర ప్రదేశ్ కాంటింజెంట్ లీడర్ గా పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ కె.సైద్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుగా సయ్యద్ హీనా పాల్గొన్నారు. విజయవంతంగా పాల్గొని తిరిగి వచ్చిన వారిని యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య డి భారతి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య విద్యావతి అభినందించారు.

వృద్ధుడికి చేయూత

ప్రజాశక్తి -కోట: అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు కటికాల నారాయణకు ప్రతి నెలా వెయ్యి రూపాయలు చొప్పున కోట మండలంలోని శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి నిర్వాహకులు అల్లం రమణయ్య అందిస్తున్నారు. నెల సాయాన్ని సోమవారం అందించారు. ఈ సందర్భంగా శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి నిర్వా హకులు అల్లం రమణయ్య మాట్లాడుతూ నెల్లూరు పట్టణానికి చెందిన ఘంటేటి ప్రదీప్ కుమార్ చేయూత మేరకు నారాయణకు ఆర్థిక సాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో పన్నంగం సాయి, వెంపులూరు బాబూరావు పాల్గొన్నారు.

తహశీల్దారు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-దొరవారిసత్రం: దొరవారిసత్రం తహశీల్దారుగా బివిఆర్‌సీహెచ్ ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గుంటూరు జిల్లా మాచవరం మండల తహశీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై దొరవారిసత్రం తహశీల్దారుగా వచ్చారు. రెండేళ్లుగా ఇన్‌ఛార్జ్‌గా ఉన్న డిప్యూటీ తహశీల్దార్ గోపినాథ్‌రెడ్డి మునుపటి స్థానంలో కొనసాగనున్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ని గెలిపించాలని గూడూరు నియోజకవర్గ నాయకులు పరిమళ వెంకటేశ్వర్లు ఓటర్లను అభ్యర్థించారు. పట్టణంలోని ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. బస్టాండ్, సంగం థియేటర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు, వ్యాపారులకు వివరించారు. జగన్, చంద్రబాబు పాలనతో ప్రజలు విసిగి పోయారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సల్మాన్ రాజు, సతీష్‌బాబు, రఘురామయ్య గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా పిఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - గూడూరు రూరల్: గూడూరు పిఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరినాథ్ పుట్టినరోజు వేడుకలు గూడూరు బాల సదన్ లో సోమవారం ఘనంగా నిర్వహించారు. 42 మంది అనాథ పిల్లలకు వారికి అవసరమైన బెడ్‌షీట్ నైట్ డ్రెస్‌లను అందించి వారితో కేక్ కట్ చేయించి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్ రవిచంద్ర , మల్లెపాటి మురళీ రెడ్డి , వాకాటి రామ్మోహన్, సెక్రెటరీ కె శివయ్య, ట్రెజరర్ పి వీరేంద్రనాథ్, మదనమేటి రమణయ్య, లయన్ సభ్యులు పాల్గొన్నారు.

14న సామూహిక ఉచిత అక్షరాభ్యాసం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతికి చెందిన వీగోర్ ఆధ్యాత్మిక సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ వసంత పంచమి సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నట్లు సేవా కేంద్రం నిర్వాహకులు చిత్రపు హనుమంతరావు తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో వీగోర్ సేవా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన తల్లిదండ్రుల పేరుపై ఏర్పాటు చేసిన సేవా కేంద్రం ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ ఉచిత సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొనే ఆసక్తి ఉన్నవారు 9985532447, 6301192026 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో సేవా కేంద్రం సభ్యులు జయలక్ష్మి, పద్మావతి, సుబ్బారావు, అంబికా వెంకట్, రామకృష్ణ పాల్గొన్నారు.

సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి - కోట: మండలంలోని పెంచిపాక పంచాయతీ నందు వైసీపీ సీనియర్ వైసిపి నాయకులు చిల్లకూరు దశరథ రామిరెడ్డి ఆధ్వర్యంలో నూతన సచివాలయ కేంద్రాన్ని వైసిపి గూడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చేతుల మీదగా సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి గూడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేరిగ మురళి, సీనియర్ వైసిపీ నాయకులు పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డి, వైసిపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, వాకాడు మాజీ ఏఎంసీ చైర్మన్ కొడవలూరు దామోదర రెడ్డి, సీనియర్ వైసిపి నాయకులు పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు త్వరలో చేపట్టాలి: వైసిపి

ప్రజాశక్తి - కోట: ఉత్తమ నెల్లూరు నుండి సిద్దవరం గ్రామం వరకు ఇటీవల సంభవించిన మిచౌంగ్ వల్ల దెబ్బతిన్న రోడ్లకు త్వరలోనే మరమ్మతులు చేపట్టాలని వైసిపి సీనియర్ నాయకులు ఇంగిలాల రామయ్య కోరారు. కోట ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల తుపాను వల్ల రోడ్లకి ఇరువైపులా మట్టి కొట్టుకుపోవడం వల్ల రోడ్లంతా గుంతలు ఏర్పడ్డాయని, దీంతో వాహనాల్లో తిరుగుతున్న ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారని వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

సమయ పాలన పాటించాలి: ఎంపీడీవో

ప్రజాశక్తి - బాలాయపల్లి: బాలాయపల్లి అరుణ సోమవారం ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా నిండ్ర మండలంలో పనిచేస్తున్న వారు ఇక్కడికి బదిలీపై వచ్చారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని కోరారు.

మధురెడ్డిని పరామర్శించిన నేదురుమల్లి

ప్రజాశక్తి - బాలాయపల్లి : వెంకటగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెందోటి మధుసూదన్ రెడ్డి ఇటీవల అనారోగ్యం నుండి కోలుకుని ఇటీవలే సాధారణ స్థితిలో వున్నారు. తిరుపతి జిల్లా వైసిపి అధ్యక్షుడు, వెంకటగిరి నియోజక వర్గం కన్వీనర్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి సోమవారం చిల్లకూరు మండలంలోని రెట్టపల్లి గ్రామంలో వారిని పరామర్శించారు. దేవుడు ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆయన అన్నారు. బాలాయపల్లి మండల ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని గుర్తు చేశారు.

మార్కెట్ యార్డు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - తడ: మండలంలోని పులిచెంద్ర ఏయమ్ సి మార్కెట్ యార్డులో మొదటి జనరల్ బాడీ సమావేశం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏయమ్‌సి చైర్మన్ పర్వతరెడ్డి కవిత ప్రభాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ గోపాల్ రెడ్డి, యస్ డీసీసీబి చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, తడ ఎంపీపీ కోళవ రఘురెడ్డి పాల్గొన్నారు.

కెవిబిపురం ఎంపీడీవోగా విశ్వనాథం

ప్రజాశక్తి -కెవిబిపురం: మండల నూతన ఎంపీడీవో గా విశ్వనాథం సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. గతంలో తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలంలో ఎంపీడీవో గా ఆయన పనిచేశారు. కేవీబీ పురం మండలంలో ఇంతకు మునుపు ఎంపీడీవో గా పనిచేస్తున్న రామచంద్రయ్యను నాయుడుపేటకు బదిలీపై వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి అధికారంలోకొస్తే అభివృద్ధి: గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : టిడిపి అధికారంలోకి వస్తేనే పేద బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందుతాయని నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ తెలిపారు. పుత్తూరు మున్సిపాలిటీ 19 వార్డులో సోమవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీలో ఆయన పాల్గొన్నారు. ఆటమెట్ల కాలనీ రోడ్లలో ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టో కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో 19 వ వార్డు ఇన్‌ఛార్జ్, గుర్రాలు, చిత్తూరు పార్లమెంట్ ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి వెంకయ్య, పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్ ఎన్ ధనపాల్, చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి తల్లీ కూతుళ్ల మృతి

ముచ్చువోలు పంచాయతీలో విషాదం

చెరువులో పడి మృతి చెందిన తల్లీకూతురు(ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: చెరువులో పడి ఇద్దరు మహిళలు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని ముచ్చువోలు పంచాయతీలో నివసిస్తున్న రత్నమ్మ, ఆమె కుమార్తె మునిరత్నమ్మ సోమవారం పశువులను మేపటానికి వెళ్లి చెరువులో విగత జీవులుగా కనపడటంతో ముచ్చివోలు పంచాయతీలో ప్రతి కుటుంబాన్ని విషాదంలోకి నెట్టింది. గ్రామస్తుల కథనం మేరకు పంచాయతీ టిడిపి మాజీ ఎంపీటీసీ శంకరయ్య సతీమణి రత్నమ్మ(63), ఆమె కుమార్తె మునిరత్నమ్మ ఇద్దరూ కలిసి సోమవారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో పశువులు మేపటానికి చెరువులోకి వెళ్లారు. భోజన సమయం కావడంతో పశువులను నీటిలోకి తోలి ఆ సమయంలో వారు భోజనం చేశారు. కొంతసేపటికి పశువులు ఇటు వైపు నుంచి అటు వైపునకు దాటుకోవడం గమనించిన వారు పశువులను దారి మళ్లించడానికి మొదట రత్నమ్మ కుమార్తె మునిత్నమ్మ నీళ్లలోకి దిగడంతో అక్కడ గుంతలు ఉండడం వల్ల ఆమె ప్రమాదంలో చిక్కుకోవడం గమనించిన ఆమె తల్లి ఆమెను కాపాడటానికి ప్రయత్నించి ఇద్దరూ ప్రమాదంలో చిక్కుకొని మరణించి ఉంటారని గ్రామస్తులు తెలిపారు. సుమారు మూడు గంటల సమయంలో పశువులు అవతలి గట్టున మేయటం గమనించిన గ్రామస్తులు మీరు ఎక్కడికి వెళ్లారని వెతకగా రత్నమ్మ చీర అంచు నీళ్లల్లో కనపడటంతో చెరువులో గమనించగా వీరి మృతదేహాలు బయటపడ్డాయని తెలిపారు. రత్నమ్మకు ఇద్దరూ కుమార్తెలు, ఒక కుమారుడు, కుమార్తె రత్నమ్మకు 13 సంవత్సరాల కుమార్తె, 11 సంవత్సరాల కుమారుడు ఉన్నారు. ముచువోలు పంచాయతీలో ఈ విషాద ఘటన చోటు చేసుకోవడంతో గ్రామమంతా ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయింది.

అర్ధరాత్రి ఆర్పీల అరెస్టు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తమ న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారం కోసం విజయవాడ సభకు బయలుదేరిన ఆర్పీలను ఆదివారం అర్ధరాత్రి వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అక్కడినుంచి స్టేషన్ కు తరలించి నిర్బంధించారు. నిబంధనలు పక్కనపెట్టి మహిళా ఆర్పీలన్న కనీస మానవత్వం లేకుండా పురుష పోలీస్ కానిస్టేబుళ్లతో ఆర్పీలను స్టేషన్ కు తరలించడాన్ని సిఐటియు నాయకులు తప్పు పట్టారు. ఆర్పిలకు మద్దతుగా వన్ టౌన్ స్టేషన్ కి వెళ్లి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్పిల సభకు అనుమతి ఉన్నా పోలీసులు అత్యుత్సాహం చూపి నిర్బంధించడం ఎంతవరకు సమంజసమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య ప్రశ్నించారు. అనంతరం ఆర్పిలను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, ఏఐటీయూసీ నాయకులు జనమాల గురవయ్య పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

చెక్ డ్యాంకు సాగునీరు ఇప్పించండి

- జాప్యం చేస్తే పంటలు ఎండిపోతాయ్..
- రాంకుమార్ రెడ్డికి వైసిపి నాయకుల వినతి

ప్రజాశక్తి -వాకాడు: 'చెక్ డ్యాంకు సాగునీరు ఇప్పించండి.. జాప్యం చేస్తే రైతుల పంటలు ఎండిపోతాయ్..' అని తిరుపతి జిల్లా వైసిపి అధ్యక్షుడు నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డికి స్థానిక వైసిపి నాయకులు విజ్ఞప్తి చేశారు. వాకాడులోని నేదురుమల్లి నివాసంలో వాకాడు, చిట్టమూరు, కోట, చిల్లకూరు మండలాల నాయకులతో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఛైర్మన్, తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరీగ మురళీధర్ సోమవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎలక్షన్లో గూడూరు నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థికి గూడూరు నియోజకవర్గంలో భారీ మెజార్టీ రావాలని కోట, వాకాడు, చిట్టమూరు వైసిపి నాయకులకు సూచించారు. గత ఎన్నికల మెజార్టీపై చర్చించారు. ఈ సందర్భంగా కొడవలూరు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిసారి వాకాడు మండలంలో వైసిపికి భారీ మెజార్టీ వస్తోందన్నారు. స్వర్ణముఖికి తెలుగు గంగ జలాలు రప్పించాలని పలువురు రాం కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఎంఎల్‌సి జోక్యం చేసుకుంటూ సీఎం దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. ఆలస్యం చేయకుండా రెండు మూడు రోజుల్లో జలాలు తెప్పిస్తే రైతులకు ఉపయోగం వుంటుందని, జాప్యం అయితే పంటలు ఎండిపోతాయని దామోదర్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ వాకాటి జనార్దన్ రెడ్డి సూచించారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి దువ్వూరు మధుసూదన్ రెడ్డి, నాయకులు నందగోపాల్ రెడ్డి అజిత్ కుమార్ రెడ్డి, కృష్ణారెడ్డి, సుధాకర్ నాయుడు, పాపా రెడ్డి రాజశేఖర్ రెడ్డి శశిధర్ రెడ్డి, రవి రెడ్డి,కోటిరెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటరత్నం, ద్వారకనాథరెడ్డి ,సంపత్ కుమార్ , మస్తానయ్య భార్గవ్ రామ్, వెంకటేశ్వర్లు,రమణయ్య పాల్గొన్నారు.

వైసిపి నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి తరలిస్తే నగదు ప్రోత్సాహకం

- ఆర్‌టివో ఆదినారాయణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను గుర్తించి సకాలంలో ఆసుపత్రుల్లో చేర్పిస్తే కేంద్ర ప్రభుత్వం ఐదు వేల రూపాయల నగదు ప్రోత్సాహకం అందిస్తుందని ఆర్‌టివో ఆదినారాయణ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రిలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టివో ఆదినారాయణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మొదటి గంట ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. సాయం చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం ఐదు వేల రూపాయలు అందజేస్తుందని, ప్రమాదాల నివారణకు నిబంధనలు పాటించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో ఎంవిఐ సునీల్, పట్టణ సీఐ పాపారావు, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ షరీనా పాల్గొన్నారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌టివో

ఆర్సిపురం తహశీల్దారుకు ఘన సన్మానం

ప్రజాశక్తి -రామచంద్రాపురం: రామచంద్రాపురం మండల తహశీల్దారుగా పి ఉషారాణి సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. వారు అనంతపురం గార్లదిన్నె నుంచి ఆర్సిపురానికి బదిలీపై వచ్చారు. రెవెన్యూ కార్యాలయ సిబ్బంది నూతన తహశీల్దారు పి ఉషారాణిని దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల విధులలో అధికారులు సిబ్బంది నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. విధులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు పునీతారాణి, మండల సర్వేయర్ వేణు, ఆర్ఐ జికృష్ణమ్మ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీ నారాయ ణ, వీఆర్వోలు సతీష్, ప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ రమాదేవి పాల్గొన్నారు.

తహశీల్దారును సన్మానిస్తున్న రెవెన్యూ కార్యాలయ సిబ్బంది

ప్రభుత్వ భూముల కబ్జాపై కఠిన చర్యలు తీసుకోవాలి: సీపీఎం

ప్రజాశక్తి - ఓజిలి : ఓజిలి మండలం పెద్దపరియ నెల్ క్యాస్ట్ పరిశ్రమ ప్రభుత్వ భూములు ఆక్రమించి నిర్మిస్తున్న ప్రహరీ గోడను వెంటనే ఆపాలని సిపిఎం ఆధ్వర్యంలో ఓజిలి డిప్యూటీ తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నేత చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఓజిలి మండలంలోని పెద్దపరియ రెవెన్యూ గ్రామంలో సర్వేనెంబర్ 24 ,25పరిధిలో నెల్ క్యాస్ట్ పరిశ్రమ ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మిస్తున్న రెవెన్యూ అధికారులకు కనబడడం లేదా?' అని దుయ్యబట్టారు. లక్షల రూపాయలు విలువచేసే భూములు కాపాడడంలో రెవెన్యూ అధికారులు భూస్వాములకు, పరిశ్రమ యాజమాన్యులకు తొత్తులుగా మారుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రహరీ గోడ నిర్మాణం ఆపాని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పరిశ్రమ చేసే అక్రమ నిర్మాణాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. పేదోళ్లు జానుడు జాగా అడిగితే మాత్రం భూములు లేవని చెప్పే అధికారులు భూస్వాములు కబ్జాలకు పాల్పడుతుంటే రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేత బి గోపాలయ్య, పెద్దపరియ గ్రామస్తులు చేజర్ల పెంచలయ్య ,రామయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తే తిరుపతి రాజధాని: మాజీ మంత్రి

ప్రజాశక్తి -కోట : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణమే తిరుపతిని రాజధానిని చేయడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ అన్నారు. సోమవారం కోట మండలంలోని సిద్ధవరం,ఉత్తమ నెల్లూరు, ఉచ్చూరు వారి పాలెం,కొక్కుపాడు గ్రామాల్లో చింతా మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కరపత్రాలు పంచుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత ఎన్నో సంవత్సరాలుగా తిరుపతిని రాజధాన్ని చేయాలనే కోరిక తనకు వుందని, దుగరాజపట్నం పోర్టును నిర్మించి లక్షలాదిమందికి ఉద్యోగ ం, ఉపాధి కల్పిస్తామని గుర్తు చేశారు. ఈ ప్రాంత ప్రజలు ధనవంతులుగా మారే అవకాశాలు వున్నాయన్నారు. అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, శ్రీ సిటీ కార్మికులు అభివృద్ధికి, రైతులకు రుణమాఫీ గిట్టుబాటు ధర, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వగలిగే శక్తి సామర్థ్యం కాంగ్రెస్ ప్రభుత్వానికే వుందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పంటా శ్రీనివాసులు రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు దుంపల నాగరాజ్, తిరుపతి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తేజోవతి, కోట మండలం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, వాకాడు మండల కాంగ్రెస్ అధ్యక్షులు దయాకర్ పాల్గొన్నారు.

40 శాతం నామినేటెడ్ పదవులు బిసిలకే: సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి- రేణిగుంట: రాబోయే టిడిపి ప్రభుత్వం లో 40 శాతం నామినేటెడ్ పదవులను బీసీలకు ఇస్తామని బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు. బీసీల చట్టాన్ని టిడిపి తీసుకుని వస్తుందని ఆయన పేర్కొన్నారు. రేణిగుంటలో మండలానికి సంబంధించి 'జయహో బిసి సదస్సు' పట్టణంలోని వై కన్వర్షన్ హాలులో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాళహస్తి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ రేణిగుంట మండలంలో బీసీలకు పెద్దపీట వేసిన ఘనత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి దని, రాబోయే రోజులలో కూడా తాను బీసీలకు పెద్ద పేట వేస్తానని వారి హక్కులు కాపాడటం కోసం వారికి రక్షణ చట్టం కల్పిస్తూ వారికి ఎల్లవేళల అండగా ఉంటానని తెలిపారు. బీసీ సోదరులందరూ కలిసికట్టుగా ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో మండల పట్టణ నాయకులు అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, మాజీ జెడ్పిటిసి సుబ్రహ్మణ్యం రెడ్డి, చిన్నారెడ్డి, మునస్వామి నాయుడు, కన్నన్ రెడ్డి, రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ఉచితం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జగనన్న కాలనీల ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌లు సబ్ రిజిస్ట్రార్ పరిధిలో కాకుండా సచివాలయం పరిధిలోని వార్డు అడ్మిన్, డబ్ల్యూఆర్ఎస్ లాగిన్ ద్వారా ఎలాంటి ఫీజు లేకుండా లబ్ధిదారులకు సోమవారం ఉచితంగా రిజిస్ట్రేషన్‌లు చేశామని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎం రెడ్డి తెలిపారు. కమిషనర్ పుత్తూరు, కల్యాణపురం, ఎన్జీవో కాలనీ, సత్య నారాయణ కాలనీ సచివాలయాలను పరిశీలించారు. నూతన పురపాలక సంఘం కార్యాలయం పెయింట్, వుడ్ పనులు, ప్రధాన ద్వారం అమర్చే పనులను పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో సచివాలయ వార్డు కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన శిబిరం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: అపోలో ఛైర్మన్ పద్మ విభూషణ్ డాక్టర్ ప్రతాప్ చంద్ర రెడ్డి జన్మదినం సందర్భంగా మండలంలోని తిమ్మబుపాలపురంలో మండల పరిషత్ పాఠశాలలో శ్రీకాళహస్తి స్టెప్స్ పథక సంచాలకులు ప్రమీలమ్మ ఆధ్వర్యంలో పిల్లలకు ఆరోగంపై సోమవారం అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఐరన్, కాల్షియం టాబ్లెట్లు, ప్రోటీన్ పౌడర్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో స్థానిక సర్పంచ్ మాతమ్మ, మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, సంస్థ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, సిబ్బంది గాయత్రి, రోజా, కళావతి, సురేష్ పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

క్రైం న్యూస్

ఇసుక ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి- నారాయణవనం : మండల కేంద్రంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును నారాయణవనం పోలీసులు సోమవారం సీజ్ చేశారు. గత కొన్ని నెలలుగా మండలంలోని చిత్తూరు కండ్రిగ , గోవిందప్పనాయుడుకండ్రిగ , రాళ్ల కాలువ, కీళగరంలోని అరుణానదిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. దీనిపై స్థానిక ప్రజల నుండి పెద్ద పోలీసులకు పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో దృష్టి పెట్టిన పోలీసులు ఇసుక లోడింగ్ చేస్తుండగా పట్టుకున్నారు. పట్టుబడ్డ ఇసుక ట్రాక్టర్‌ను పోలీసు స్టేషన్‌కి తరలించి ట్రాక్టర్ యజమాని టీ ఊరప్ప, డ్రైవర్ బి రఘులను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేల స్థావరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - ఓజిలి : కోడిపందేల స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించి ఐదు గురిని అదుపులో తీసుకున్నారు. ఎస్ఐ .పి రవిబాబు కథనం మేరకు మండలంలోని జోసులవారి కండ్రిగ గ్రామ సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారని అందిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం కోడిపందేల స్థావరాలపై దాడులు నిర్వహించగా కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురితో పాటు రెండు పందెం కోళ్ళు , రూ.11,20 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసుదర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడిలో కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు ,అఖిల్ , రమేష్ ,రవి పాల్గొన్నారు.

గంగమ్మ మూలవిరాట్టు పరిశీలన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ దేవాలయం ఏడు గంగమ్మల గుడి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా సోమవారం గంగమ్మ మూలవిరాట్టుకు పంచనామా నిర్వహించి పరిశీలించారు. దేవాదాయ శాఖ సిబ్బంది, రెవెన్యూ, పోలీసులు, పట్టణ ప్రముఖులు, మీడియా సమక్షంలో ఏడు గంగమ్మ మూలవిరాట్టుకు పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్టు కింద చిన్న బంగారు రేకు, చిన్న వెండి రేకు, రాగి యంత్రం, ఐదు రూపాయలు, ఒక రూపాయి, అర్ధ రూపాయి నాణేలు లభించాలని ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు తెలిపారు. వీటిని అనుబంధ దేవాలయం ఇన్‌చార్జ్ కి అందజేశామన్నారు.

కెవిబిపురం తహశీల్దారుగా శ్రీరాముల నాయక్

ప్రజాశక్తి కేవిబిపురం: కేవీ బి పురం మండలం తహశీల్దారు గా ఎం శ్రీరాములు నాయక్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు ఈ కెవిబిపురం మండలంలో పనిచేస్తున్న తహశీల్దార్ శ్రీదేవి బదిలీపై అనంతపురం వెళ్లారు. అనంతరం తహశీల్దారును మండల ఎంపీపీ రాయదుర్గం ముని లక్ష్మీ నందకుమార్, డిప్యూటీ తహశీల్దారు మునిరత్నం, పలువురు మండల నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విఎస్ఎస్ ఎన్నికలు నిర్వహించాలి

ప్రజాశక్తి - వెంకటగిరి రూరల్: తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంలోని గొట్లగుంట వన సంరక్షణ సమితి సభ్యులు సోమవారం ఫారెస్ట్ రేంజర్ రాజేంద్ర ప్రసాద్ కలిసి సభ్యుల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. గత రెండు రోజులు ముందు వనరక్షణ సమితి సభ్యులు పూర్తి పేరు లేకుండా కొంతమంది పేర్లు రాసుకొని ఎన్నికలు నిర్వహించకుండా ఏకగ్రీవంగా ఒకరిని ఎన్నుకోవడం సరికాదని సమితి సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వన సంరక్షణ సమితిలో సభ్యులుగా ఉండి పనిచేస్తున్న మమ్ములను మీ పేర్లు లేవు మీరు వెళ్ళచ్చు అని కొందరు ఫారెస్ట్ సిబ్బంది అనడం బాధాకరమని వాపోయారు. ఎంతో కాలంగా ఉన్నా సభ్యులందరితో ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

పులివర్తి నాని తనయుడి ప్రచారం

ప్రజాశక్తి -రామచంద్రాపుం: మండలంలోని గణేశ్వర పురం పంచాయతీ లో చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ చేపట్టిన 'మీ ఇంటికి..మీ పులివర్తి నాని' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పంచాయతీలోని కొత్త కండ్రిగ గ్రామంలో టిడిపి నాయకులు కార్యకర్తలు వినీల్ కి ఘన స్వాగతం పలికారు. తమ నాన్న పులివర్తి నానికి రానున్న ఎన్నికలలో సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఈ మురళి నాయుడు, కే. నరసింహారెడ్డి, తుంగా.భాస్కర్ నాయుడు, రావిళ్ళ గిరి, రాజమాణిక్యం నాయుడు, మధుసూదన్ రెడ్డి, కే ధనుంజయ రెడ్డి, కమలాకర్ రెడ్డి, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఎంపీడీవోని కలిసిన సర్పంచ్

ప్రజాశక్తి - వెంకటగిరి రూరల్: తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంలోని చింత గుంట పంచాయతీ సర్పంచ్ మండల పరిషత్ అధికారి నీలకంఠేశ్వర్ రెడ్డిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా చింతపండు సర్పంచ్ కాలే చెంచు సాయి ప్రసన్నకుమార్ ఉపాధి హామీ పనులు సక్రమంగా నిర్వహించడానికి తమ పంచాయతీలో క్షేత్ర సహాయకులు లేరని వారిని ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపీడీవో స్పందిస్తూ ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఏపీవో దీపిని పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు.

వైసీపీలో పలువురి చేరిక

ప్రజాశక్తి -ఏర్పేడు :శ్రీకాళహస్తి నియోజకవర్గం, ఏర్పేడు మండలం, నచ్చనేరి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పలువురు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్ర రెడ్డి, ఏర్పేడు మండల ఇంచార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు.

In The Court of the 1st Additional Junior Civil Judge: Tirupati
O.S.No.276/2022

Bank of Baroad, (Vijaya Bank), T.P.Area Branch, rep by its Chief Manager ...Plaintiff

V/s

1) Syed Aslam
2) Syed Haseena Banu @ Syed Aseena ...Defendants

Suit summons to Defendants No.1 and 2

1) Syed Aslam S/o Syed Gaffar
2) Smt Syed Haseena Banu @ Syed Aseena W/o Syed Gaffar,
Both are residing at D.No.34, Nethaji Road, Tirupati

The Plaintiff filed the suit for recovery of amount Rs.57,974.00 against you No.1 (the defendant) & Anther. The above case is posted to 20.02.2024 at 10.30 A.M. in the above court for your appearance and raise objections if any either in person or through advocate otherwise the matter will be decided on the records available in the case.

Hearing Date: 20.02.2024

G.Madhusudhana Reddy
Advocate for Plaintiff. Cell: 9440934263

IN THE COURT OF HONOURABLE PRINCIPAL SENIOR CIVIL JUDGE ::TIRUPATI
O.S.No. 113/2023

Between
Sri Kondagari Hari Krishna, S/o. Late K. Ravindranath, Flat No.502, 5th Floor, New Balaji Residency Apartments, Door No.6-8-1030, NGOs Colony, K.T.Road, Tirupati Town and District. ... Plaintiff

And
Sri.K. Balasubramanyam ... Defendant

SUIT SUMMONS TO THE DEFENDANT

To
Sri K.Balasubramanyam, S/o. K. Polisettty, D.No.18-1-7/4, Ramachandra Nagar, K.T.Road, Tirupati Town and District.

Sirs

Please Take Notice that the above suit filed against you for damages and compensation of Rs.25,43,754/- and interest and costs thereon due from you and the said suit is posted to 26.02.2024 for your appearance. if you got any objections inthe above suit you can appear either in person or through an advocate on 26.02.2024 at about 10-30 a.m. before the above named court and file objections if any. Failing which the matter will be decided expartee in your absence.

By order of the court
Prem Kumar Karanam
Advocate, House No:6-7-605,
Sripuram Colony, KT Road,
Tirupati Town and District - 517 507.

In the Court of the III Addl. District Judge:: Tirupati
E.P.No.80 of 2018
O.S.No. 55 of 2017

Between
P. Raviraj ... Petitioner/DHR
V/s
B. Karunakara Chowdary ... Respondent/JDr

NOTICE TO JUDGEMENT DEBTOR/ RESPONDENT

B.Karunakara Chowdary
S/o. Late B. Kannaiah Naidu,
Kadirimangalam Village and Post,
Vadamalapet Mandal, Chittoor District.
Working as President, Vadamalapet PACS,
C/o. Kotireffy, C.E.O. Kranthi Street, Vadamalapet,
Chittoor District.

Please Take Notice that the above EP filed by the Dhr/Petitioner against the JDr Uder order 21 Rule 34 C.P.C for execution of the registered sale deed infavour Dhr and the matter is posted to 14.02.2024 for your appear either in person or through your counsel at about 10:30a.m in the above court. In the event of your absence that matter will be decidedexparte.

Hearing Date: 14.02.2024

N.Manohar, M.A., B.L
Advocate, Tirupati, Cell: 9346981333.

IN THE COURT OF JUNIOR CIVIL JUDGE, NAIDUPETA
O.S.No.119/2020

Andhra Bank, Naidupeta,
Branch, Repre by Its
Senior Manager by Name
R.Kanal Jothi ... Plaintiff

Vs

Shaik Khaja,
S/o. Sk. Babu,
Door No. 6-5-507/6,
L.A.Sagaram,
Naidupeta Town and Mandal,
S.P.S.R.Nellore District ... Defendant

ప్రకటన

పై నెంబరు దావాలోని వాది, ప్రతివాదిపై తనకు కట్టువలసిన లోను రూ॥ 1,53,259.00 మరియు వడ్డీ ఖర్చులు కొరకు పై కోర్టులో దావా వేసివున్నారు. సదరు దావా నెంబరు ఓ.యస్.నెం.119/2020, పై కోర్టువారు సదరు దావాను తేది 08.02.2024న ప్రతివాది హాజరు కొరకు వాయిదా వేసివున్నారు. కావున ప్రతివాది తేది 08.02.2024న ఉదయం 10-30 గంటలకు పై కోర్టులో హాజరై జవాబు దాఖలా చేసుకున్నవలెను. లేని యెడల దావాను కోర్టువారు పరోక్షముగా తీర్మానించబడను.

ఇట్లు,
డి.హరనాథరెడ్డి, B.A, B.L
వాది తరపు అడ్వకేట్
నాయుడుపేట
సెల్ : 9440329137

IN THE COURT OF JUNIOR CIVIL JUDGE, NAIDUPETA
O.S.No.217/2019

Andhra Bank, Naidupeta,
Branch, Repre by Its
Senior Manager by Name
R.Kanal Jothi ... Plaintiff

Vs

1. Duvvuru Koteswara Reddy, S/o. Jayaramireddy, Pichireddythopu, Naidupeta Town and Mandal, S.P.S.R.Nellore District
2. Nemallapudi Balachandra Reddy, S/o. Veera Raghavareddy, Chembedu Village, Pellakuru Mandal, S.P.S.R.Nellore District.
3. Sannareddy Sumathi, W/o. Ramalingareddy, Chembedu Village, Pellakuru Mandal, S.P.S.R.Nellore District ... Defendants

ప్రకటన

పై నెంబరు దావాలోని వాది, ప్రతివాదులు పై తనకు కట్టువల్లసిన రెండు లోనులు రూ॥ 12,76,428.00 వడ్డీ మరియు ఖర్చులు కొరకు పై కోర్టులో దావా వేసివున్నారు. సదరు దావా నెంబరు ఓ.యస్.నెం.217/2019, పై కోర్టువారు సదరు దావాను తేది 08.02.2024న ప్రతివాదులు హాజరు కొరకు వాయిదా వేసివున్నారు. కావున ప్రతివాదులు తేది 08.02.2024న ఉదయం 10-30 గంటలకు పై కోర్టులో హాజరై జవాబు దాఖలా చేసుకున్నవలెను. లేని యెడల దావాను కోర్టువారు పరోక్షముగా తీర్మానించబడను.

ఇట్లు,
డి.హరనాథరెడ్డి, B.A, B.L
వాది తరపు అడ్వకేట్
నాయుడుపేట
సెల్ : 9440329137